ఉత్తర భారతీయులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి


మహేష్‌కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఉత్తర భారతీయులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌కు మెమోరాండం అందజేశారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో 20 నుంచి 30 శాతం ఉత్తర భారతీయులు ఉన్నప్పటికీ ఒక్క కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో ఉత్తర భారతీయులైన మార్వాడీ, జైస్వాల్ సమాజ్, రాజస్థానీ, సమాజ్, లోధ్ సమాజ్, యాదవ హైర్ సమాజ్, క్షత్రీయ రాజ్‌పుత్‌ల సమాజ్‌లతో పాటు పలు సమాజ్‌ల వారు కాంగ్రెస్ గెలుపునకు ఎంతో కృషి చేశారన్నారు. దాదాపు 50 లక్షలు జనాభా ఉన్న ఉత్తర భారతీయుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఉత్తర భారతీయులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉండాలని నిర్మల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఉత్తర భారతీయుల సమస్యలు తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్నా సింగ్, విజయేందర్ జైస్వాల్, సురేష్‌కుమార్, గోకరణ్ సింగ్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్ర వాతావరణంలో వంటలు..

కనిపించని సేఫ్టీ మెజర్స్

- ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో స్పష్టం..
- నిబంధనలు పాటించని షాదాబ్, అరేబియన్ రెస్టారెంట్, నిమ్రా హోటల్


నిమ్రా హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆధ్వర్యంలోని టాస్క్ ఫోర్సు అధికారుల బందం పాతబస్తీలోని బిర్యానీ హోటల్స్‌తో పాటు పాయా చోర్వా, ఇరానీ ఛాయ్ బిస్కట్ల హోటళ్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించగా పలు తప్పిదాలు బట్టబయలయ్యాయి. చార్మినార్ పరిధిలోని షాదాబ్, అరేబియన్ రెస్టారెంట్, నిమ్రా హోటల్స్‌లలో తనిఖీలు నిర్వహించిన అధికారులకు ఎక్కడా సరైన ఫుడ్ సేఫ్టీ మెజర్స్ పాటించడం లేదని తేలింది. ఆరోగ్యవంతులైన పని వారు వంటలు చేస్తున్నట్లు ఏ హోటల్స్‌లో సర్టిఫికెట్స్ అందుబాటులో లేవని అధికారులు చెప్పారు. అంతేకాకుండా అపరి శుభ్రమైన మాంసం, చికెన్‌లతో పాటు ఇతర మాంసాహారాన్ని ఫ్రిజ్‌లలో ప్రిజర్వ్ చేసి కస్టమర్లకు అందజేస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాలకు సంబంధించి కనీస నిబంధనలు పాటించడం లేదని స్పష్టమైందన్నారు. అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వంట గదుల్లో ఎలాంటి హెయిర్ క్యాప్‌లు, గ్లౌజులు, ఆప్రాన్స్ ధరించకుండా ఫుడ్ సప్లై చేస్తున్నారన్నారు. కాల్చిన మాంసాన్ని మళ్లీ మళ్లీ వేడి చేయడం, కాల్చడం, ఈగలు, దోమలు ప్రవేశించకుండా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం.. ఫ్రెష్ క్రీం, పేస్ట్రీ వంటి ఆహార వస్తువులు ఎలాంటి గుర్తింపు లేబుల్స్ లేకుండా రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉంచడం.. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నిజమైన కాపీని హోటల్స్‌లో ఎక్కడ ప్రదర్శించకపోవడం తదితర తప్పిదాలను అధికారుల తనిఖీలలో బట్టబయలైంది. సరైన ఆధారాలు లేని కొన్ని ఆహార పదార్థాల వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించండి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గోపాల్‌జీ తదితరులు

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పోలీసులు అడ్డగోలుగా చేపట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమానికి కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు, నాయకులు ఆందోళన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గోపాల్‌జీ మాట్లాడుతూ..తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి రాజ్యమేలిందన్నారు. పోలీసు అధికారులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఫోన్ ట్యాపింగ్ చేపట్టడం సిగ్గుచేటన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డైరెక్షన్‌లోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన పోలీసులు అధికారులు విచారణలో పెట్టినప్పటికీ కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు కేసులు నమోదు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకులు ఉమాశంకర్, దాసరి చంద్రశేఖర్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం


పురస్కార గ్రహీతలతో సారిపల్లి కొండల్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళావాహిణి ఆధ్వర్యంలో సూపర్‌స్టార్ కృష్ణ 82వ జయంతి వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలుగు సినీ చరిత్రలో సూపర్‌స్టార్ కృష్ణ తనకంటూ మంచి స్థాయిని పెంపొందించుకున్నారని కొనియాడారు. అనంతరం సినీ నటుడు పరుచూరి గోపాలకృష్ణ, దర్శకులు పి.సాంబశివరావు, ఎంవీ రఘు, ముప్పలనేని శివ, నిర్మాత మల్లికార్జున్‌రావుకు సూపర్‌స్టార్ కృష్ణ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు కృష్ణ డాక్యుమెంటరీ ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వర్‌రావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, తెలుగు సినిమా రచయితల సంఘం కార్యదర్శి అనురాధ, సంస్థ అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవతరణ వేడుకలకు ముస్తాబు


అసెంబ్లీ భవన సముదాయానికి అవతరణ శోభ


త్రివర్ణ శోభితంగా డీజీపీ కార్యాలయం

నాంపల్లి: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు చారిత్రాత్మకమైన కట్టడాలు ముస్తాబు అవుతున్నాయి. జూన్ 2న అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం వైభవంగా నిర్వహించబోతోంది. కొత్త రాష్ట్రం తెలంగాణ ఆవిర్భవించాక అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఈ వేడుకలు మొదటి సారిగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నాంపల్లిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం (గన్‌పార్కు), రాష్ట్ర శాసన సభ (అసెంబ్లీ), శాసన మండలి సభ (జూబ్లీహాలు), డీజీపీ కార్యాలయం, పబ్లిక్‌గార్డెన్ తదితర ప్రాంతాలన్నీ త్రివర్ణ శోభితంగా విద్యుత్ కాంతులతో వెలిగేలా ఏర్పాట్లు చేశారు. గన్‌పార్కును రంగు రంగుల పూలతో అలంకరించారు.

ఉప్పర్‌బస్తీలో కలుషిత నీటి సరఫరా



గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఉప్పర్‌బస్తీలో కొన్ని రోజులుగా నల్లాలో కలుషిత నీరు సరఫరా అవుతుంది. గత వారం రోజులుగా నల్లాలో వస్తున్న నీరు వల్ల ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారని బీజేపీ నాయకుడు గోదా లక్ష్మీకాంత్‌యాదవ్ అన్నారు. నల్లాలో వస్తున్న నీటి గురించి జలమండలి లైన్‌మెన్ దృష్టికి తీసుకువెళ్లానని ఆయన పేర్కొన్నారు. అయితే లైన్‌మెన్ తనకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఆహ్లాదకరంగా బాలల వేసవి సమ్మేళనం

సుల్తాన్‌బజార్: కమలాకర సంగీత నిత్య కళాక్షేత్రం లైనేజ్ క్లబ్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో బాలల వేసవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు వివిధ సాంస్కృతిక, క్రీడాంశాలలో పాల్గొని ఆహుతులను ఆహ్లాద పరిచారు. క్రీడల్లో రాణించిన ప్రతిభావంతులకు పతకాలు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, సత్యవాణి, కృష్ణకుమారి, లలితా పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ఈసారి ఉమ్మడి కమిటీకి

మీరాలంమండి ప్రాతినిధ్యం

- వాస్తవానికి ఈ ఏడాది బంగారు మైసమ్మ ఆలయ కమిటీకి బాధ్యతలు
- అనివార్య కారణాలతో ముందుకు రాని బంగారు మైసమ్మ కమిటీ
- రొటేషన్ పద్ధతిలో ముందుకు వచ్చిన మీరాలంమండి కమిటీ
- నేడు ఉమ్మడి కమిటీకి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న గాజుల అంజయ్య


బంగారు బోనం కోసం వినియోగించే బంగారు పాత్ర

చార్మినార్: ప్రతి ఏడాది నిర్వహించే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రాధాన్యత ఎంతో ఉంటుంది. పాతబస్తీలోని 8 ప్రధాన ఆలయాలకు చెందిన ప్రతినిధులు రొటేషన్ పద్ధతిలో ఒక్కో ఏడాది ఒక్కొక్కరు చొప్పున కమిటీ చైర్మన్ బాధ్యతలను చేపట్టి వారి ఆధ్వర్యంలో పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈ సారి జరిగే బోనాల జాతర ఉత్సవాల కోసం వాస్తవానికి హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయానికి చెందిన ప్రతినిధుల్లో ఒకరు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. అనివార్య కారణాలతో ఈ సారి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ముందుకు రాకపోవడంతో.. రొటేషన్ పద్ధతిలో 2025 ఏడాదిలో వచ్చే అక్కన్న మాదన్న ఆలయ కమిటీకి 2024 బాధ్యతలను అప్పగించడానికి ముందుకు వచ్చారు. ఈ విషయమై సంబంధిత కమిటీ సభ్యులతో సంప్రదింపులు జరుపగా.. ఈ ప్రతిపాదనకు అక్కన్న మాదన్న ఆలయ కమిటీ అంగీకరించ లేదు. యథావిధిగా 2025 ఏడాదిలోనే తాము ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ బాధ్యతలు చేపడతామని చెప్పారు.

ముందుకు వచ్చిన మీరాలంమండి ఆలయ కమిటీ..

అక్కన్న మాదన్న ఆలయ కమిటీ నిరాకరించడంతో బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు 2026లో వచ్చే మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ ప్రతినిధులను సంప్రదించారు. ఉమ్మడి ప్రతిప్రాదనలను కమిటీకి వివరించారు. దీనికి ఈసారి ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ బాధ్యతలు చేపట్టడానికి మీరాలంమండి కమిటీ ముందుకు వచ్చింది. ఈఏడాది మీరాలంమండి ఆలయ కమిటీ చైర్మన్ బాధ్యతలను చేపడితే... తిరిగి బంగారు మైసమ్మ ఆలయ కమిటీ వారు 2026లో చైర్మన్ బాధ్యతలు చేపట్టి వారి ఆధ్వర్యంలో అప్పుడు ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం రాత్రి దేవాలయం ప్రాంగణంలో ఏకగ్రీవ తీర్మానం చేసుకోవడంతో ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ నిర్వహించనుంది.

నేడు బాధ్యతల స్వీకరణ..


గాజుల అంజయ్య

గత ఏడాది జరిగిన ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను గౌలిపురాలోని భారత మాత, కోట మైసమ్మ ఆలయం కమిటీ తరపున ఆలె భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో జరిగాయి. దీంతో ఈసారి బాధ్యతలను నిర్వహించడానికి ముందుకు వచ్చిన మీరాలంమండి కమిటీకి ఆయన శనివారం రాత్రి గౌలిపురా ఆలయ ప్రాంగణంలో అప్పగించనున్నారు. ఇప్పటికే మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గాజుల అంజయ్య, 2024-ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీకి కూడా చైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

నేడు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

చాంద్రాయణగుట్ట: హనుమాన్ జన్మదినోత్సవానికి ఫలక్‌నుమా జహనుమాలోని ప్రాచీనమైన 400 ఏళ్ల నాటి హనుమాన్ ఆలయం ముస్తాబయ్యింది. దూప దీప నైవేద్యాలకు దూరంగా ఉన్న ఈ ఆలయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ సురేందర్ సహకారంతో ఆలయ అధ్యక్షుడు మంద ఆశీష్ రాజ్, మరో భక్తుడు విశ్వనాథ్ ఆలయం వద్ద అభివృద్ధి పనులు చేపట్టారు. శనివారం జన్మోత్సవం సందర్భంగా విశ్వశాంతి, గో సంరక్షణార్థం 108 సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

గోల్కొండ: కష్టజీవుల రాజ్యాన్ని స్థాపించడమే తమ లక్ష్యమని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు సి.మల్లేష్ అన్నారు. శుక్రవారం టోలిచౌకి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌కట్ చేసి కార్మికులకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. కార్మిక సంఘాలను సంఘటిత పరుస్తు కార్మిక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్ మాట్లాడుతూ.. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకులకు వ్యతిరేకంగా పోరాడి గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, గణేష్, నరసింహ, వెంకటేశం, యాదమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ


శ్రీవారికి పట్టువస్త్రాలను తీసుకువెళ్తున్న మురళీధర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తిరుమల తిరుపతి దేవస్థానంలో శుక్రవారం జరిగిన శ్రీవారి కల్యాణోత్సవంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.మురళీధర్‌రెడ్డి పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సమాజ సేవకే జీవితం అంకితం


అన్నదానం నిర్వహిస్తున్న ముజీబ్ హుస్సేని, ఏఆర్.రాజ్‌కుమార్, శివకుమార్ తదితరులు

అబిడ్స్: సమాజ సేవకే జీవితం అంకితమని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ప్రతినెలా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ సేవలో పాలుపంచుకుంటున్నట్లు వెల్లడించారు. శుక్రవారం ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఆవరణలో టీఎన్జీఓస్ యూనియన్, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ..తన తల్లిదండ్రుల పేరిట అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేఆర్.రాజ్‌కుమార్, మహ్మద్ అబ్దుల్ ముజీబ్, వైదిక్ శాస్త్రీ, బొల్లిగిద్ద శంకర్, ముఖీం ఖురేషి, మహ్మద్ వహీద్, మహ్మద్ ముస్తఫా షరీఫ్, మహ్మద్ హబీబ్ సాహుస్, జమాల్ జహంగీర్, ఆసుపత్రి యూనిట్ సభ్యులు శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు


సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులతో ఉప సంచాలకులు శ్రీలత తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయి. ఈ మేరకు శుక్రవారం ఎల్బీస్టేడియంలో ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ ఉప సంచాలకులు శ్రీలత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వేసవి శిక్షణ శిబిరాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ శిబిరాలలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనీష, టీవీ నటులు సంజయ్, మురళి, శ్రీకాంత్, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ధనలక్ష్మి, చంద్రారెడ్డి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సీనియర్ ప్రొఫెసర్ స్కేల్ ఇవ్వాలి


బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సీనియర్ ప్రొఫెసర్ స్కేల్ ఇవ్వాలని గోల్కొండ ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కపిలవాయి శ్రీనివాసరాజు కోరారు. ఈ మేరకు ఆయన బుర్రా వెంకటేశంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కపిలవాయి శ్రీనివాసరాజు మాట్లాడుతూ..ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న ప్రిన్సిపల్స్‌కు ప్రొఫెసర్ ర్యాంక్‌లో క్రెడిబిలిటి 14లో ఉన్నారని కాగా ప్రిన్సిపాల్స్‌గా పదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసిన వారికి ప్రొఫెసర్ ర్యాంకు నుంచి సీనియర్ ప్రొఫెసర్ ర్యాంకులో 14, 15వ కేటగిరి వర్తింపజేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

జులై 8, 9, 10 తేదీల్లో ఢిల్లీలో లాల్‌దర్వాజా పదో వార్షిక బోనాలు


మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్

చాంద్రాయణగుట్ట: ఈ ఏడాది జులై 8, 9, 10వ తేదీల్లో ఢిల్లీలో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి దశాబ్ది వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్ తెలిపారు. ఆలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014లో ఢిల్లీలో లాల్‌దర్వాజా బోనాలను నిర్వహించడం ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగానే ఈ సారి జులై 7న ఆలయం నుంచి పెద్ద ఎత్తున ఊరేగింపుగా బయల్దేరనున్నామన్నారు. 8న తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ఉత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తామన్నారు. 9న ఇండియా గేట్ నుంచి అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి తెలంగాణ భవన్‌లో స్థాపిస్తామన్నారు. 10న పోతరాజుల విన్యాసాలు, బోనాల జాతర ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, బీజేపీ నేత స్మృతి ఇరానీలను ఆహ్వానించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి-1,2 బి.మారుతీ యాదవ్, ఎ.చంద్రకుమార్, కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, కోశాధికారి పోసాని సతీష్ ముదిరాజ్, ప్రచార కార్యదర్శి శేషు నారాయణ, సాంస్కృతిక కార్యదర్శి వినోద్ కుమార్, మాజీ చైర్మన్లు మాణిక్ ప్రభు గౌడ్, బంగ్లా రాజు యాదవ్, కె.విష్ణు గౌడ్, తిరుపతి నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణ గౌడ్, సి.రాజు కుమార్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

'ఫోర్ మెన్ కమిటీ'సభ్యుల సస్పెన్షన్..

2022-23 మధ్య కాలంలో ఆలయ 'ఫోర్ మెన్ కమిటీ'చైర్మన్లుగా పనిచేసిన శీర రాజ్‌కుమార్, భద్రీనాథ్ గౌడ్, సి.శివ కుమార్ యాదవ్, పోసాని సురేందర్ ముదిరాజ్‌లు ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలను కమిటీకి సమర్పించనందుకు గాను కమిటీ నుంచి నలుగురిని సస్పెండ్ చేస్తూ కమిటీ నిర్ణయం తీసుకుంది. నోటీసులు ఇచ్చినా స్పందించనందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు 2023-24 సంవత్సరంలో కోశాధికారిగా పనిచేసిన పోసాని సదానంద్ ముదిరాజ్ ఐ.పి (దివాళ పిటీషన్) వేసినందుకు అతన్ని కూడా అనర్హుడిగా ప్రకటించి, అతని స్థానంలో పోసాని సతీష్ ముదిరాజ్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నామన్నారు. ఇక ఢిల్లీలో పోతరాజు వేషధారణ వేసే పోసాని సుధాకర్ ముదిరాజ్ ఆలయ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నందున, అతడిని కూడా ఆలయ కమిటీ వ్యవహారాల్లో పాల్గొనకుండా అనర్హుడిగా పేర్కొంటూ కమిటీ తీర్మానం చేసింది.

ఘనంగా రంగనాయక స్వామి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు తదితరులు

గోల్కొండ: నానల్‌నగర్ తిరుపల్లి గడ్డలోని కోవెల రంగనాయక స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి సమేత గోదా రంగనాథ స్వామి వార్ల మొదటి వార్షికోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం 7.30 గంటలకు స్వామి వార్లకు పంచామృతములతో అభిషేకం, పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 9 గంటలకు స్వామి వారికి హోమం మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ. శ్రీనివాసరాజు, భక్తులు ఎం.నర్సింహ్మా, ఎస్.జనార్ధన్, గోల్కొండ శ్రీ మహంకాళీ ఆలయ పూజారి సురేష్‌చారి, శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, జబుసింగ్, బింకు పాల్గొన్నారు.

'ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తాం'


వేణుగోపాల్ రావు

యాకుత్‌పురా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యాక్రమాలు నిర్వహించి గత ఏడాది పలు కోర్సుల్లో శిక్షణ పొంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన యువతీ యువకులకు ప్రశంస పత్రాలను ప్రదానం చేయనున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగా సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ కే.వేణుగోపాల్‌రావు తెలిపారు. పురానీహవేలీ అజ్మత్‌జా ప్యాలెస్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2023-24 విద్యా సంవత్సరంలో తమ సంస్థలో శిక్షణ పూర్తి చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రశంస పత్రాలను అందిస్తామన్నారు. అదే విధంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలకు బహుమతులను ప్రదానం చేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

ఉపాధికల్పన శాఖలో ఉష సేవలు ఎనలేనివి



విజయనగర్‌కాలనీ: సర్వీసులో చేరినప్పటి నుంచి ప్రభుత్వ ఉపాధి కల్పన శాఖలో 37 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు సేవలందించి అనేక మందికి ఉపాధి బాట చూపిన కె.ఉష సేవలు ఎనలేనివని ఆ శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఉపాధి శిక్షణ శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ పొందిన ఉష ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని శుక్రవారం విజయనగర్‌కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉపాధికల్పన అధికారులు కె.భవాని, లింగ్యా నాయక్, హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి నందిగామ మైత్రిప్రియ, ఉన్నతాధికారులు రేఖరాణి, రమేష్‌బాబు, రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి జయశ్రీ పాల్గొన్నారు.

'మూడోసారీ బీజేపీదే అధికారం'


దేవర వంశీ


గోల్కొండ: కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం, ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకుడు దేవర వంశీ అన్నారు. దేశ ప్రజలు నేడు ప్రధాని పాలన తీరు మెచ్చుకుంటున్నారన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మోదీదే అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో దేశం ఆర్థికంగా బలియంగా తయారయ్యిందని మరోవైపు శాస్త్ర సాంకేతిక రంగాల్లో సైతం అగ్రదేశాలకు సై అంటూ పోటీ ఇస్తుందని ఆయన అన్నారు. కనీవిని ఎరగని రీతిలో అత్యధిక స్థానాలు బీజేపీ గెలుచుకోవడం ఖాయమని ఆయన అన్నారు.

సన్మానం


అనంతోజ్ రాజేశ్వర్ రాజ్‌ను సత్కరిస్తున్న వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతోజ్ రాజేశ్వర్ రాజ్‌ను వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్‌లు గాజుల అంజయ్య, రాకేశ్ తివారి, ప్రవీణ్‌కుమార్ గౌడ్, మధుసూదన్ గౌడ్‌తో పాటు బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, బుల్లెట్ శ్రీధర్, వినయ్, దిలీప్, రవి క్రిష్ణ తదితరులు ఆయనను సత్కరించారు. నూతన అధ్యక్షుడు అనంతోజ్ రాజేశ్వర్ రాజ్ ఆధ్వర్యంలో ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయని ఆలయాల కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పని చేసే వారికే గుర్తింపు: ఎమ్మెల్యే కౌసర్



గోల్కొండ: కష్టపడి పని చేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సీనియర్ మజ్లిస్ నాయకుడు, ప్రముఖ ఫొటో గ్రాఫర్ అబ్బాస్ హుస్సేన్‌ను శుక్రవారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ స్థానికంగా గుర్తింపు తెచ్చుకున్న సందర్భంగా అబ్బాస్ హుస్సేన్‌ను సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రఫత్ హుస్సేన్, జహంగీర్‌బేగ్, వలీ, అలీముద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌అలీ తదితరులున్నారు.

'అందెశ్రీ, కీరవాణిపై బీఆర్ఎస్ నేతలు వ్యతిరేకంగా మాట్లాడడం దారుణం'


గౌరీ సతీష్

అబిడ్స్: తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించిన అందెశ్రీ, కీరవాణిలపై, బీఆర్ఎస్ నేతలు వ్యతిరేకంగా మాట్లాడడం దారుణమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. గతంలో చేనేత వస్త్రాలకు అంబాసిడార్‌గా ప్రకటించిన సమంతవాణి, రకుల్‌ప్రీత్ సింగ్ కానీ యాదాద్రికి ఆర్కిటెక్‌గా నియమించిన ఆనంద సాయి ఎవరని ఆయన ప్రశ్నించారు. పదేళ్లపాటు తెలంగాణ చరిత్రను, తెలంగాణ సంస్కృతిని నాశనం చేసిన బీఆర్ఎస్ అగ్ర నాయకులకు ప్రజలు గత ఎన్నికలలో గుణపాఠం చెపినా వారికి ఏ మాత్రం జ్ఞానం రావడం లేదన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎంత మంది తెలంగాణ ఉద్యమకారులకు, తెలంగాణ వీరులకు ద్రోహం చేశారో కేటీఆర్, హరీష్‌రావుతో పాటు అగ్ర నాయకులు అర్థం చేసుకోవాలని గౌరి సతీష్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు, తెలంగాణ వీరులకు, తెలంగాణ ఉద్యమ కారులకు, తెలంగాణ మేధావులను గౌరవించి వారికి అన్ని విధాల ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు.